క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ రోడ్‌లోని విద్యుత్ లేన్ల మార్పు నిమిత్తం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ, గుండిమెడ గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలన



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలో రూ.కోటీ 30 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈ కృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పెనుమాక ఉండవల్లి రోడ్ నుంచి అమరావతి రహదారి వెళ్లేందుకు పెనుమాక హిందూ శ్మశానవాటిక మీదుగా మరో రహదారిని నిర్మిస్తున్నామని, ఆక్రమణలు తొలగించి 900 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణాన్ని రూ.40 లక్షలతో నిర్మిస్తున్నామని, సీసీ రోడ్ నిర్మాణం పూర్తయిన అనంతరం మరో రూ.90 లక్షల వ్యయంతో ఉండవల్లి రోడ్ నుంచి కృష్ణాయపాలెం, అమరావతి వరకు బీటీరోడ్ నిర్మాణం చేపడతామని, ఈ రహదారి నిర్మాణం వల్ల అమరావతి నుంచి వచ్చే వారు పెనుమాకలోకి వెళ్లకుండా నేరుగా ఉండవల్లి వచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు



మేడికొండూరు: మండల పరిధిలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాస శర్మ అన్ని గ్రామాల రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశం నెలవారీ పరీక్షల్లో భాగంగా పౌరసరఫరాలకు సంబంధించి మండలంలోని రేషన్ డీలర్లు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రత్యేక పాత్ర పోషించి రేషన్ సరుకులు సక్రమంగా ప్రజలకు అందించాలని తహసీల్దారు తెలియజేశారు. రేషన్‌లో అవకతవకలు జరిగితే స్పందించేది లేదన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసశర్మ, పౌరసరాల శాఖ అధికారి అనిల్ పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని మాబుసుభానీ ఉరుసు మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గార్మె పండుగను పురస్కరించుకొని మొదటిరోజు ఉరుసు మహోత్సవంలో భాగంగా గుర్రంపై గంధం ఉంచి గ్రామంలో ఊరేగించారు. పకీర్లు గానం చేస్తుండగా గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి, దర్గా వద్ద గంధం, పూలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ముజావర్లు సయ్యద్ గౌస్, సయ్యద్ అబ్దుల్‌లు పర్యవేక్షించారు.

స్టాన్‌ఫోర్డ్ యూఐఎఫ్ ప్రోగ్రామ్‌కు వీవీఐటీ విద్యార్థులు

పెదకాకాని: ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన డిజైన్ స్కూల్ నిర్వహించే యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రోగ్రామ్‌కు కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శుక్రవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు 2024 ఏప్రిల్‌లో నెదర్లాండ్ యూనివర్సిటీ ఆఫ్ ట్వెంటీలో నిర్వహించనున్న యూఐఎఫ్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారన్నారు. కళాశాలకు చెందిన పోవూరి రిషిత, అభినవ్ అడ్డగట్ల, అభిరామ్ జొన్నలగడ్డ, చరిష్మా నేలకుర్తి, కృష్ణసుమంత్‌రెడ్డి పాలసాని స్టాన్‌ఫోర్డ్ సంస్థ నిర్వహించిన ఆరు వారాల డిజైన్ థింకింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపినట్లు చెప్పారు.

సీఎం జగన్ సారథ్యంలోనే సంక్షేమాభివృద్ధి

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- సిరిపురం గ్రామంలో ప్రభుత్వ నూతన భవనాలు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

మేడికొండూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమాభివృద్ధిని చేస్తున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే, గ్రామ సచివాలయ నూతన భవనాలను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటికిపైగా ఖర్చుతో వీటిని నిర్మించామని తెలిపారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ సిరిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాల వల్ల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. సిరిపురం గ్రామ అభివృద్ధికి రూ.23 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గతంలో 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు తేడా గమనించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఇటువంటి ముఖ్యమంత్రి లేరని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాల గురించి దేశం రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. సంక్షేమం పాలనతో ప్రజల హృదయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి నిలిచి ఉన్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ గెలిస్తే రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నవ స్వప్న, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, మండల అభివృద్ధి అధికారి కె.ప్రభాకరరావు, మండల కన్వీనర్ పి.వంశీకృష్ణ, కె.పరమేశ్వరరావు, సాంబశివరావు, ప్రదీప్, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, ఫిరంగిపురం మండల అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, టి.మురళీ, తహసీల్దారు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



తప్పెట శృతి (ఫైల్)

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో పనిచేసే యువతి ఆరు అంతస్తుల భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నగర పాలక సంస్థ పరిధిలోని గుడిమెడలో నివాసముండే తప్పెట అరుణ్‌కుమార్, దుర్గ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుమార్తె శృతి (19) యూనివర్సిటీలోని ఓ క్యాంటీన్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తోంది. గురువారం సాయంత్రం క్యాంటీన్ మూసివేసిన అనంతరం తన స్నేహితురాలైన పావనితో కలసి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పావని యూనివర్సిటీలోని ఆర్ అండ్ డీ డిపార్ట్‌మెంట్‌లో ఆగింది. పావని పని ముగించుకుని శృతి కోసం బయట చూడగా ఆమె జాడ కనిపించలేదు. పావని ఇంటికి వెళ్లిపోయింది. శృతి గురించి ఆమె తల్లిదండ్రులు గురువారం రాత్రి పావనిని విచారించారు. నా కన్నా ముందే వచ్చేసిందని చెప్పింది. తెల్లవారుజామున శ్రీకాంత్ అనే వ్యక్తి ఆర్ అండ్ డీ బిల్డింగ్ వెనుక శృతి కిందపడి ఉండడం చూసి యూనివర్సిటీ యాజమాన్యానికి సమాచారం అందించాడు. వెంటనే ఆమెను కాలేజీ అంబులెన్స్‌లో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు శృతి తల్లిదండ్రులతో కలసి యూనివర్సిటీకి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. శృతి ఆత్మహత్య సమయంలో సెల్‌ఫోన్ పూర్తిగా ధ్వంసమైంది. ఆర్థిక బాధలు తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మాత్రం పగిలిపోయిన సెల్‌ఫోన్‌లో సమాచారాన్ని పూర్తిగా పరిశీలించి పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత శృతి మృతికి గల కారణాలు వెల్లడిస్తామని తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

తాతిరెడ్డిపాలెం(తాడికొండ): విద్యుత్ మోటార్‌తో నీరు పెడుతుండగా షాక్ తగలడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెం జగనన్న కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు బ్రాడీపేటకు చెందిన జక్కిరెడ్డి వీరారెడ్డి (48) లాం గ్రామ పంచాయతీ పరిధిలోని తాతిరెడ్డిపాలెంలో జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి నీరు కొడుతుండగా పైపు నుంచి కారుతున్న నీరు లీకేజీని సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. సమాచారం అందుకున్న తాడికొండ ఎస్ఐ నాగార్జున ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మేడికొండూరు: మండల పరిధిలోని యలవర్తిపాడు గ్రామంలో ఇటీవల ఇరువర్గాల ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందగా హత్య కేసు నమోదు చేశారు. హత్య కేసులో నిందితులు పరారీలో ఉన్నారు. సీఐ వాసు తన సిబ్బందితో నిందితులు మన్నవ మహేష్‌కుమార్, మరియకుమారిలను ప్రత్తిపాడు గ్రామ పరిసరాల్లో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వాసు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఉర్దూ డీఐ

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ఉర్దూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం సందర్శించారు విద్యార్థినిచే ఉర్దూ పాఠాన్ని బోర్డుపై రాయించి చదివించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేశారని అన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి రానున్న సమ్మేటివ్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చెరువుల సుందరీకరణకు ప్రత్యేక కార్యాచరణ

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- బుడంపాడు చెరువు అభివృద్ధి పనులు పరిశీలన



బుడంపాడులో చెరువు పరిశీలిస్తున్న నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

గుంటూరు రూరల్: నగరంలోని చెరువుల సుందరీకరణ, అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని 16వ డివిజన్ బుడంపాడులోని చెరువు అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ అధికారులతో కలసి పర్యటించి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నగరంలోని విలీన గ్రామల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామాల సుమారు రూ.4 వందల కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు. నగరంలోని 16వ డివిజన్ బుడంపాడులోని 55 ఎకరాల చెరువును అమృత్ పథకంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బుడంపాడు చెరువులో న్యూ బండ్ ఫార్మేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, డీసీడింగ్(పూడిక తీత) ఇతర సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో గుంటూరు నగరంలోని అన్ని డివిజన్లలో కుల, మత, పార్టీలకతీతంగా పారదర్శకంగా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బుడంపాడులోని ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పాలకవర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 16వ డివిజన్ ఇన్‌చార్జి పెద్దింటి రామకోటి, నగర పాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, డీఈఈ కళ్యాణ్‌రావు, బోరుగడ్డ రజనీకాంత్, దాసరి వాసు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌లో నివాసం ఉండే డి.మణికంఠ(25) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమార్తెకు హైదరాబాద్‌లో లివర్ సంబంధిత వ్యాధికి ఆపరేషన్ చేయించాడు. అందుకు అప్పులు చేశాడు. అప్పులు చెల్లించలేక గురువారం మణికంఠ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారిని మోసం చేసిన ఘటనపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన అడ్డా శ్రీనివాసరావు నూనె గానుగ నిర్వహిస్తుంటాడు. ఈనెల 23న వినియోగదారుడు షాపుకు వచ్చి ఆయిల్ కొనుగోలు చేశాడు. తన వద్ద డబ్బులు లేవని, ఇంటి వద్ద ఉన్న వదిన ఫోన్ పే చేస్తోందని చెప్పాడు. అందుకు శ్రీనివాసరావుకు ఒక ఫోన్ నంబరు ఇచ్చి ఇ నంబరుకు రూ.1 చెల్లించాలని కోరాడు. శ్రీనివాసరావు వినియోగదారుడు చెప్పిన విధంగా ఆ సెల్ నంబరుకు ఫోన్‌పే ద్వారా రూ.1 చెల్లించాడు. వినియోగదారుడు టీ తాగి వస్తానని వెళ్లాడు. కొంతసేపటికి శ్రీనివాసరావు అకౌంట్‌లోని రూ.82వేలు విత్‌డ్రా అయ్యాయి. శ్రీనివాసరావు తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేల్దారు కార్మికుడిపై వాచ్‌మన్ దాడి

గుంటూరు ఈస్ట్: బేల్దారు కార్మికుడిపై వాచ్‌మెన్ దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 1వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద షేక్ సుభాని బేల్దారు పనులు చేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న వాచ్‌మెన్ వెంకట్ సుభానితో గొడవపడి దాడి చేశాడు. దాడిలో సుభానికి గాయాలు అయ్యాయి. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా భాస్కరరావు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పీవీకే భాస్కరరావును నియమిస్తూ మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, నవంబర్ 5వ తేదీ వరకు స్వీడన్, ఆస్ట్రేలియా దేశాల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ఎస్ఈ భాస్కరరావు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా స్థానిక చెంచుపేటలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. దోమకాటు వల్ల అనేక వ్యాధులు వస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని చెప్పారు. ఫ్రైడేను డ్రైడేగా అందరూ పాటించాలన్నారు.

మనసున్న మహారాజు సీఎం జగనన్న

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్



వైద్యపరీక్ష చేయించుకుంటున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: మనసున్న మహారాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యాన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఓపీ ఏర్పాట్లను సురేష్‌కుమార్ పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందిచే వైద్య పరీక్ష చేయించుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పదార్థాలను రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గాలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్రంలో పథకాలు అందేలా జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగేలా కృషిచేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి మేలు చేకూర్చాలని విద్య, వైద్యం, వ్యవసాయం సంబంధిత విషయాల్లో మరింత శ్రద్ధ చూపారని చెప్పారు. గడిచిన 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు లక్షల కోట్లు అవినీతి చేయడంతో నేడు జైలు పాలయ్యాడని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సేవలు ప్రజలకు అందుతున్నాయని వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరలా గెలుపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శిబిరంలో 559 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని వారిలో 38మందిని పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి ఫరీనాబేగం తెలిపారు. అనంతరం కళ్ల పరీక్షలు, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు, మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, సర్పంచ్ ఆదంబీ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, చిట్టా బాపూజీరెడ్డి, జి.మస్తాన్‌వలి, ఖాసింషాహిద్, ఖాజావలి, ఎస్.నూర్ వలి, ఎస్‌కె.షరీఫ్, వి.సుభానీ, పాలపాటి రఘు, కె.అప్పిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, వైద్యులు పి.ఎస్తేరురాణి, మేఘన, భీమేష్‌నాయ్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీ ఖాజాబీ, హెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎం మాధురి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఆయుధాల ప్రదర్శన



విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్

తాడేపల్లిరూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మంగళగిరి 6వ బెటాలియన్‌కు చెందిన అధికారులు వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. మంగళగిరి ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సిబ్బంది చేపట్టే చర్యల గురించి వివరించామని, విపత్తుల సమయంలో ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడడానికి ఉపయోగించే వివిధ పరికరాల గురించి అవగాహన కల్పించామన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు ఉపయోగించే వివిధ ఆయుధాలు, రైఫిళ్లతోపాటు ఎకె 47 వంటి అత్యాధునిక మెషిన్ గన్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిర్వహించే విధుల గురించి విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, హ్యాపీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకర్‌రాజు, బెటాలియన్ ఆర్ఐలు పి.చంద్రరావు, జి.సుభాష్ చంద్రబోస్, ఆర్ఎస్ఐ ఎం.లోకేష్, ఏఆర్ఎస్ఐలు పి.రఘుబాబు, ఎస్.మూర్తి, వై.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్‌కు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఉండవల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, నిత్య జీవితంలో చాలామంది విద్యార్థులు వాటికి బానిసలై నష్టపోతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి, కౌన్సెలింగ్ నిర్వహించి డి ఎడిక్షన్ సెంటర్‌కు పంపించాలని వివరించారు. నవజీవన్ జోనల్ కో ఆర్డినేటర్ కె. ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డి ఎడిక్షన్ చికిత్స చేయవచ్చని, ఈ చికిత్స అందించేందుకు నూజివీడు మండలం పోనసనిపల్లిలో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు 9490492020ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ బి.నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో ఈ క్రాప్ ముసాయిదా జాబితా

గ్రామసభలో తుళ్లూరు మండల వ్యవసాయాధికారిణి శ్రీరంజని



ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

తాడికొండ: రైతు భరోసా కేంద్రాలలో విడుదల చేసిన ముసాయిదా జాబితా ఆదివారం వరకు అందుబాటులో ఉంటుందని తుళ్లూరు మండల ఏవో శ్రీ రంజని తెలిపారు. తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం, లింగాయపాలెం, రాయపూడి, పెదపరిమి, వడ్డమాను గ్రామాలలో గురువారం ఖరీఫ్–2023 పంట నమోదు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్‌బీకేలలో అందుబాటులో ఉన్న ముసాయిదా జాబితాను రైతులు సరిచూసుకొని ఏమైనా సవరణలు ఉంటే అభ్యంతరాలను సంబంధిత ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి సరిదిద్దుకోవాలన్నారు. పంట అమ్మకం, ప్రభుత్వం నుంచి ఇతర సహాయం అందించాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరి కనుక రైతులు ముసాయిదా జాబితా సరిచూసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయకులు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాలువ పునఃనిర్మాణం చేయాలి

తాడేపల్లిరూరల్: వర్షపు నీరు బయటకు పంపేందుకు ఏర్పాటు చేసిన డ్రెయినేజీ కాలువను పునఃనిర్మించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలసి డ్రెయినేజీ కాలువను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలలో నిలిచిన వర్షపు నీరు బయటకు పంపేందుకు తవ్విన కాలువ పూడుకుపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో పంటలు దెబ్బతిని, రైతులు నష్టపోతున్నారని అన్నారు. పంటలు ముంపునకు గురికాకుండా కాలువను పూడిక తీయించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 2020వ సంవత్సరం అక్టోబర్ నెలలో అధిక వర్షాలు కురిసినపుడు ప్రధాన పంటలైన అరటి, పసుపు, కంద, ఆకుకూరలు వర్షపు నీటిలో నాని దెబ్బతిన్నాయని తెలిపారు. కుంచనపల్లి నుంచి మెల్లెంపూడి గ్రామ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్ వరకు కాలువ పూర్తిగా పూడుకుపోవడం వలన పంటన్నీ దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, ఉండవల్లి గ్రామ ఉపాధ్యక్షులు పెద్దిశెట్టి వీరాస్వామి, అమ్మిశెట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సేవలు భేష్

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు అందుతున్న సేవలు బాగున్నాయని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న మాచవరం గ్రామానికి చెందిన నల్లమేకల శ్రీనివాస రావును ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో క్యాన్సర్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ దుర్గా ప్రసాద్, నాట్కో ట్రస్టు కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ / Union Bank of India

ఫిరంగిపురం శాఖ

ఎఐఎల్ చర్చ్ కాంపౌండ్, ఫిరంగిపురం, గుంటూరు జిల్లా, ఫోన్ : 9347433035

బంగారు నగల వేలము నోటీసు

... ది.08-11-2023, బుధవారం సాయంత్రం 4.00 గంటలకు ... ది.08-11-2023 మధ్యాహ్నం 2.00 గంటలలోపు ... రూ.10,000/-లు ...

క్ర.సం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు	మొత్తం (గ్రా.)
1	043130100242719	పి. నరసింహారావు	63.00
2	043130100244285	దార్ల శివయ్య	20.00
3	043130100392458	అద్దేపల్లి లక్ష్మీతులసి	62.00
4	043130100392407	అద్దేపల్లి లక్ష్మీతులసి	64.00
5	043130100392476	అద్దేపల్లి లక్ష్మీతులసి	59.00
6	043116730001738	[illegible]	11.00

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com